## సికింద్రాబాద్ జోన్ హబ్సిగూడలో 25 స్పా సెంటర్లపై డీసీపీ ఆకస్మిక తనిఖీలు



**దశ, ఓయూ:** ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని 25 స్పా, మసాజ్ సెంటర్లపై శుక్రవారం సాయంత్రం స్పెషల్ డ్రైవ్లో బాగంగా సికింద్రాబాద్ జోన్ పోలీసులు ఆకస్మిక తణికీ చేపట్టారు. ఈ కార్యక్రమంలో డీసీపి రక్షితమూర్తి పాల్గొన్నారు. హబ్సిగూడ, తార్నాక ప్రాంతాల్లోని పలు స్పా, మసాజ్ సెంటర్లకు వెళ్లి నిబంధనలు పాటిస్తున్నారా లేదా, పని చేసే సిబ్బందికి అర్హతా సర్టిఫికేట్లు ఉన్నాయా, క్రాస్ మసాజ్ వంటి అనే విషయాలపై ఆరా తీసారు. ట్రేడ్ లైసెన్స్, పర్మీషన్లు ఉన్నాయా, మైనర్లు పని చేస్తున్నారా అని అడిగి తెలుసుకున్నారు. బయటి రాష్ట్రాల నుంచి ఇక్కడ పని చేసే వారికి సరైన ధృవీకరణ పత్రాలు ఉండేలా చూసుకోవాలన్నారు. ఈ సందర్భంగా డీసీపీ మాట్లాడుతూ అందరూ సీసీ టీవీలను ఏర్పాటు చేసుకోవాలన్నారు.నిబంధనలు ఉల్లంఘిస్తే ఆ సెంటర్లను సీజ్ చేయడంతో పాటు చట్టపరంగా కఠిన చర్యలుంటాయనీ హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏసీపీ జగన్, డీఐ లెనిన్బాబు, ఎస్ ఐ లు జయచంద్ర, చంద్రశేఖర్,కరుణాకర్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.


## ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద రైతుల గోస ప్రభుత్వం మొద్దు నిద్ర వీడాలి

❖ *కప్పాటి పాండురంగా రెడ్డి*



**దశ, రంగారెడ్డి :** రాష్ట్ర ప్రభుత్వం రైతుల పక్షపాతి అని గొప్పలు చెప్పుకుంటున్నా, క్షేత్రస్థాయిలో ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద పరిస్థితి మాత్రం దారుణంగా ఉంది. పండించిన పంటను అమ్ముకోవడానికి అన్నదాతలు పడిగాపులు కాస్తున్నా, సంబంధిత ప్రభుత్వ యంత్రాంగం పట్టించుకోకపోవడం అత్యంత దురదృష్టకరం అని రంగారెడ్డి జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ టిఆర్ఎస్ నాయకులు కప్పాటి పాండురంగా రెడ్డి అన్నారు. జిల్లాలోని పలు మండలాల్లో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలకు రైతులు తమ ధాన్యాన్ని తరలించిన 50% కూడా కొనుగోలు చేయలేదని ప్రభుత్వం నిర్ణయించిన నాణ్యతా ప్రమాణాల పేరుతో, ఆరబెట్టిన ధాన్యంపై కూడా 'తేమ ఎక్కువ ఉంది' అని సాకు చెబుతూ క్వింటాలుకు 5 నుండి 8 కిలోల వరకు తరుగు తీస్తూ రైతులను దోచుకుంటున్నారు. కొనుగోలు కేంద్రాల వద్ద కనీసం త్రాగునీరు, నీడ లేక రైతులు, కూలీలు తీవ్ర అవస్థలు పడుతున్నారు. అకాల వర్షాల భయంతో ధాన్యం తడవకుండా ఉండేందుకు టార్పాలిన్లు కూడా అందుబాటులో లేవు. ఒకవేళ ధాన్యం విక్రయించినా, రైతు ఖాతాల్లోకి డబ్బులు ఎప్పుడు జమవుతాయో తెలియని అయోమయ స్థితి నెలకొంది. దీనివల్ల తదుపరి సాగుకు పెట్టుబడి కోసం రైతులు ప్రైవేట్ వడ్డీ వ్యాపారులను ఆశ్రయించాల్సి వస్తోంది. ప్రభుత్వం సన్న రకం వరిని పండించే రైతులకు క్వింటాకు రూ. 500 అదనపు బోనస్ రైతుల బ్యాంకు ఖాతాల్లో త్వరగా జమ చేయాలని అన్నారు.


## కంచి కామకోటి పీఠాధిపతులకు పూర్ణకుంభ స్వాగతం



**దశ, యాదగిరిగుట్ట:** నేడు ఉదయం 9:37 నిమిషములకు శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి వేద పాఠశాల మరియు దేవస్థాన ఇతర అభివృద్ధి పనులకు శంకుస్థాపన కార్యక్రమానికి హాజరయ్యేందుకు వచ్చిన కంచి కామకోటి పీఠాధిపతులు పరమహంస పరివ్రాజకాచార్యులు శ్రీ శ్రీ శ్రీ శంకర విజయేంద్ర సరస్వతి స్వామి కి ఆలయ అధికారుల దేవస్థాన ప్రధానార్చకులు, ఉప ప్రధానార్చకులు, అర్చకులు, వేద పండితులు వేదమంత్రోచ్చారణలతో పూర్ణకుంభ స్వాగతం పలికారు. స్వామివారి దర్శనానంతరం కళావేదిక వద్ద స్వామి భక్తులనుద్దేశించి అనుగ్రహభాషణం చేశారు. ఈ కార్యక్రమములలో దేవాదాయ ధర్మాదాయ శాఖ డైరెక్టర్, ఐఏఎస్ అధికారి ఎం.హనుమంతరావు, ఈవో జె. భవాని శంకర్ ఐ.ఏ.ఎస్ , అనువంశిక ధర్మకర్త బి. నరసింహామూర్తి , ఇతర అధికారులు, ఉద్యోగ సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

## ఘనంగా ఆదం విజయకుమార్ జన్మదిన వేడుకలు

❖ *సేవా కార్యక్రమాలు నిర్వహించిన నాయకులు, కార్యకర్తలు*



**దశ, ఓయూ:** సికింద్రాబాద్ నియోజకవర్గానికి చెందిన సీనియర్ నాయకుడు ఆదం విజయకుమార్ జన్మదిన వేడుకలు నగరంలోని పలు ప్రాంతాల్లో నాయకులు, కార్యకర్తలు ఘనంగా నిర్వహించారు. జన్మదినాన్ని పురస్కరించుకుని వివిధ ప్రాంతాల్లో సేవా కార్యక్రమాలు చేపట్టి శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ సందర్భంగా లాలాపేట్‌కు చెందిన మున్నూరు కాపు సంఘం నాయకులు గర్ష మోహన్ రావు ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. ఆకుల సంపత్ కుమార్, చందుపట్ల సంజయ్ కుమార్, చందుపట్ల అరవింద్ తదితరులు పాల్గొని ఆదం విజయకుమార్‌కు పుష్పగుచ్ఛం అందజేసి, శాలువాతో ఘనంగా సత్కరించారు. అనంతరం మిఠాయిలు పంపిణీ చేసి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొని ఆదం విజయకుమార్‌కు శుభాకాంక్షలు తెలిపారు.

# సమస్యల సుడిగుండంలో "నాగోల్ సర్కిల్" కార్యాలయం






- ❖ *50 మంది సిబ్బందికి ఒకటే మరుగుదొడ్డి!*
- ❖ *అధ్వాన్నంగా భవన నిర్మాణం – భద్రత శూన్యం.*
- ❖ *డిజిటల్ సేవలకు విఘాతం.. నిలిచిపోయిన ఆన్‌లైన్ పనులు.*
- ❖ *గత ప్రజాప్రతినిధులు, ఉన్నత అధికారుల నిర్లక్ష్యంపై విమర్శలు.*

**దశ, పెద్ద అంబర్పేట్:** ప్రజా సేవలకు కేంద్ర బిందువుగా నిలవాల్సిన ప్రభుత్వ కార్యాలయం అది. కానీ, ప్రస్తుతం అక్కడ అడుగుపెడితే ప్రభుత్వ ఆఫీసా లేక ఏదైనా పాత గిడ్డంగా (గోదాము) అనే అనుమానం రాక మానదు. రంగారెడ్డి జిల్లా పరిధిలోని నాగోల్ సర్కిల్ పెద్ద అంబర్పేట్‌లో ఉన్న రెవెన్యూ మరియు మున్సిపాలిటీ కార్యాలయాల దుస్థితిపై ప్రత్యేక కథనం. 15 ఏళ్ల క్రితం నాటి గ్రామపంచాయతీ భవనంలోనే నేటికీ కనీస మౌలిక వసతులు లేకుండా కొనసాగుతున్న ఈ కార్యాలయం, అటు ఉద్యోగులకు, ఇటు వచ్చే ప్రజలకు నరకప్రాయంగా మారింది.











### అధ్వాన్నంగా భవన నిర్మాణం – శూన్యం.

కార్యాలయం లోని రెవిన్యూ సెక్షన్ భవన పైభాగం రేకులతో నిర్మించబడింది. వాటి కింద వేసిన ఫాల్ సీలింగ్ ధర్మకోల్ షీట్లు పూర్తిగా దెబ్బతిని, విరిగి వేలాడుతున్నాయి. దెబ్బతిన్న సీలింగ్ కారణంగా కార్యాలయం అంతటా ఎలుకలు విచ్చలవిడిగా సంచరిస్తూ పరిశుభ్రతను పూర్తిగా దెబ్బతీస్తున్నాయి. కీలకమైన ఫైల్స్, పత్రాలను నిల్వ చేయడానికి సరైన స్థలం లేదా రాక్‌లు లేకపోవడంతో ముఖ్యమైన అధికారిక పత్రాలు ఎక్కడికక్కడ పేరుకుపోయాయి. దీనివల్ల పనుల్లో తీవ్ర ఆలస్యం, గందరగోళం నెలకొంటోంది. కార్యాలయంలో భద్రతను పర్యవేక్షించాల్సిన సీసీ కెమెరాలు ఏమాత్రం పనిచేయడం లేదు. దీంతో కార్యాలయానికి కనీస భద్రత కరువైంది. కార్యాలయం గదుల మీదుగా వెళ్లే పైపులైన్లు లీక్ అవ్వడం వల్ల గోడల నుండి నీరు కారుతోంది. ఆఫీస్ అంతా దుర్వాసన వ్యాపించడంతో ఉద్యోగులు అనారోగ్యం బారిన పడే ప్రమాదం పొంచి ఉంది. కార్యాలయంలో కనీసం ఫ్యాన్లు కూడా సరిగ్గా లేకపోవడంతో ఉద్యోగులు తీవ్రమైన ఉక్కపోత మధ్య నరకయాతన అనుభవిస్తూ పనిచేస్తున్నారు.

### 50 మందికి ఒకటే మరుగుదొడ్డి!

పెద్ద అంబర్పేట్ సర్కిల్ కార్యాలయంలో కింది స్థాయి ఉద్యోగుల నుంచి డిప్యూటీ కమిషనర్ వరకు దాదాపు 50 మంది సిబ్బంది పనిచేస్తున్నప్పటికీ, వారందరికీ ఒకటే మరుగుదొడ్డి ఉండటం తీవ్ర అసౌకర్యానికి దారితీస్తోంది. ముఖ్యంగా మహిళా ఉద్యోగులు ఈ పరిస్థితుల్లో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కనీస మౌలిక సదుపాయాలు కూడా లేకుండా ఉద్యోగులు పనిచేయాల్సి రావడం ఆశ్చర్యానికి గురిచేస్తోంది. ప్రజా సేవల కోసం రోజూ వందలాది మంది వచ్చే కార్యాలయంలో పరిశుభ్రత, సౌకర్యాల లోపం స్పష్టంగా కనిపిస్తోంది. అయితే వీరందరికీ కలిపి కేవలం ఒక్కటే మరుగుదొడ్డి ఉండటం అత్యంత దారుణమైన విషయం. ఉన్న ఒక్క మరుగుదొడ్డి కూడా సక్రమంగా పనిచేయకపోవడంతో ముఖ్యంగా మహిళా ఉద్యోగులు, మహిళా సిబ్బంది పడుతున్న ఇబ్బందులు వర్ణనాతీతం.

### డిజిటల్ సేవలకు విఘాతం.. నిలిచిపోయిన ఆన్‌లైన్ పనులు

ప్రభుత్వం డిజిటల్ సేవలకు ఎంత ప్రాధాన్యత ఇస్తున్నప్పటికీ, ఈ కార్యాలయంలో మాత్రం పరిస్థితి భిన్నంగా ఉంది. విచ్చలవిడిగా పడి ఉన్న విద్యుత్ వైర్లు, వైఫై కేబుల్స్ సక్రమంగా పనిచేయడం లేదు. దీనివల్ల ఇంటర్నెట్ వ్యవస్థ స్తంభించి, ఆన్‌లైన్ ద్వారా ప్రజలకు అందాల్సిన డిజిటల్ సేవలు పూర్తిగా దెబ్బతిన్నాయి. పనుల కోసం వచ్చే వందలాది మంది ప్రజలు గంటల తరబడి వేచి చూడాల్సి వస్తోంది. ఆఫీస్ గదులు సక్రమంగా నిర్వహించకపోవడంతో అవి స్టోర్ రూమ్‌లుగా మారిపోయాయి. దీంతో సిబ్బంది చిన్న చిన్న ఇరుకు గదుల్లో కూర్చొని విధులు నిర్వహించాల్సి వస్తోంది.

### గత ప్రజాప్రతినిధులు, ఉన్నత అధికారుల నిర్లక్ష్యంపై విమర్శలు.

పెద్ద అంబర్పేట్ మున్సిపాలిటీగా మారి, విలీన ప్రక్రియ పూర్తయినప్పటికీ ఇక్కడి పరిస్థితుల్లో ఎలాంటి మార్పు రాలేదు. గత పదేళ్లపాటు పాలన సాగించిన ప్రజాప్రతినిధులు ఓట్ల కోసం, రాజకీయాల కోసం పోరాడారే తప్ప.. కనీసం ఉద్యోగులకు కనీస సౌకర్యాలు కల్పించాలనే చిత్తశుద్ధిని ప్రదర్శించలేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అధికారుల పాలన వచ్చినా పరిస్థితి మెరుగుపడకపోవడంతో, ప్రస్తుతం తమ సమస్యలను పట్టించుకునే నాథుడే లేడని ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

### భద్రత గాలికొదిలేస్తే.. ఉద్యోగి బైక్ గోవిందా!

భద్రత కోసం పెట్టిన సీసీ కెమెరాలు ఎప్పుడో మూగబోయాయి. దాని పర్యవసానమే - గత నెల కిందట ఆఫీస్ ఆవరణలో ఓ ఉద్యోగి పార్క్ చేసిన ద్విచక్ర వాహనాన్ని పట్టపగలే దొంగ ఎత్తుకుపోయాడు. సీసీ ఫుటేజ్ చూసి దొంగను పట్టుకుందామంటే, కెమెరాలు బొమ్మలుగా మారిపోయాయి. చేసేదేమీ లేక బాధిత ఉద్యోగి పోలీస్ స్టేషన్ చుట్టూ కాళ్లరిగేలా తిరగాల్సి వచ్చింది. ఆఫీస్‌లో కెమెరా ఒక్కటి పనిచేసి ఉంటే దొంగ దొరికేవాడు, ఈ ఖర్చు తప్పేది. ప్రభుత్వ ఆఫీస్‌లోనే ఉద్యోగికి రక్షణ లేకపోతే, సామాన్య ప్రజల పరిస్థితి ఏంటి? లక్షలు పెట్టి కెమెరాలు పెట్టి, మెయింటెనెన్స్ చేయకపోవడం అధికారుల చేతకానితనానికి పరాకాష్ట కాదా? అని ప్రశ్నిస్తున్నారు.

రోజువారీ పనుల నిమిత్తం వందలాది మంది వచ్చే ఈ కార్యాలయాన్ని ఉన్నతాధికారులు వెంటనే సందర్శించాలి. భవనాన్ని పునరుద్ధరించి, సిబ్బందికి కనీస మౌలిక సదుపాయాలు (మరుగుదొడ్లు, ఫ్యాన్లు, కూర్చోవడానికి వసతులు) కల్పించాలి. ప్రజా సేవలకు ప్రతీకగా ఉండాల్సిన కార్యాలయాన్ని సమస్యల వలయం నుండి బయటపడేసి, ప్రజలకు అనుకూలమైన వాతావరణాన్ని కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉందని స్థానికులు కోరుతున్నారు.


## పెద్ద అంబర్ పేట -మల్లన్నగుట్ట రోడ్ విస్తరణ పనుల పరిశీలన

❖ *కొత్త బ్రిడ్జి, రోడ్ స్ట్రెయిట్నింగ్‌కు త్వరలో శాంక్షన్*



**దశ, పెద్ద అంబర్‌పేట్:** ప్రజల ప్రయాణ భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇస్తూ పెద్ద అంబర్‌పేట్ మునగనూర్ రోడ్ మల్లన్నగుట్ట రోడ్ విస్తరణ పనులకు ప్రభుత్వం వేగం పెంచింది. ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగా రెడ్డి ఆదేశాలతో తెలంగాణ రాష్ట్ర రోడ్స్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ మల్ రెడ్డి రామ్ రెడ్డి చొరవ తీసుకొని మల్లన్నగుట్ట రోడ్ విస్తరణలో భాగంగా ఉన్న కల్వర్ట్ స్థానంలో కొత్త బ్రిడ్జి నిర్మాణం, అలాగే నాలుగు ప్రమాదకర మలుపులు ఉన్న రోడ్డును స్ట్రెయిట్ రోడ్‌గా మార్చే అంశంపై అధికారులతో అత్యవసర స్థాయి పరిశీలన నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక రైతులకు ఎలాంటి అభ్యంతరాలు లేవని తెలుసుకున్న రామ్ రెడ్డి, ప్రజల భద్రతను దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యంతో ఈ పనులను చేపడుతుందని తెలిపారు. వెంటనే ఆర్ & బి శాఖ ENC మోహన్ నాయక్, SE రవిశంకర్, EE రమేష్, AE మాణి శంకర్‌లతో అర్జెంట్ సైట్ ఇన్స్పెక్షన్ నిర్వహించి, వారం నుంచి పది రోజుల్లో అంచనాలు సిద్ధం చేసి కొత్త బ్రిడ్జి, రోడ్ స్ట్రెయిట్నింగ్ పనులకు ఎంత వ్యయం అయినా శాంక్షన్‌లు మంజూరు చేయనున్నట్లు వెల్లడించారు. కాగా విస్తరణకు 5 కోట్ల శాంక్షన్ ఉండగా కొత్త బ్రిడ్జి నిర్మాణం అండ్ రోడ్ స్ట్రెయిట్నింగ్ కు సుమారు 56 కోట్లు వ్యయం అవుతుందని అంచనా వేసినట్లు సమాచారం .ఈ కార్యక్రమంలో పెద్ద అంబర్‌పేట్ మున్సిపాలిటీ మాజీ వైస్ చైర్మన్ సిద్దెంకి కృష్ణారెడ్డి, మాజీ కౌన్సిలర్ పసుల రాజేందర్, నాయకులు పండుగల రాజు, విజయేందర్ రెడ్డి తో పాటు స్థానిక రైతులు, మాజీ కౌన్సిలర్లు, తుర్కయాంజాల్, పెద్ద అంబర్‌పేట్ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## వడదెబ్బతో చిరు వ్యాపారి మృతి.. కుటుంబాన్ని ఆదుకోవాలని విజ్ఞప్తి



**దశ యాదగిరిగుట్ట:** యాదగిరిగుట్ట మున్సిపాలిటీ పరిధిలోని 9వ వార్డుకు చెందిన చిరు వ్యాపారి సుంచు శ్రీనివాస్ (58) వడదెబ్బకు గురై మృతి చెందిన ఘటన స్థానికంగా విషాదాన్ని నింపింది. వివరాల్లోకి వెళితే.. శ్రీనివాస్ పాతగుట్ట దేవాలయానికి వెళ్లే మార్గంలో రేకుల షెడ్డులో చిన్న వ్యాపారం నిర్వహిస్తూ కుటుంబాన్ని పోషించేవారు. గత కొద్ది రోజులుగా నమోదవుతున్న రికార్డు స్థాయి ఉష్ణోగ్రతలు, వడగాలుల ప్రభావంతో రేకుల షెడ్లలో తీవ్ర ఉష్ణ పరిస్థితులు నెలకొన్నాయి. అప్పటికే అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న శ్రీనివాస్ శుక్రవారం మధ్యాహ్నం అకస్మాత్తుగా అస్వస్థతకు గురై కుప్పకూలారు. ఇది గమనించిన స్థానికులు వెంటనే ఆయనను ప్రభుత్వ ఆసుపత్రికి తరలించే ప్రయత్నం చేయగా, మార్గమధ్యంలోనే ఆయన మృతి చెందినట్లు సమాచారం. అనంతరం వైద్యులు పరీక్షించి వడదెబ్బ కారణంగానే మరణం సంభవించినట్లు నిర్ధారించినట్లు తెలిసింది. శ్రీనివాస్ కుటుంబానికి ఆయనే ఏకైక జీవనాధారం కావడంతో కుటుంబ సభ్యులు తీవ్ర విషాదంలో మునిగిపోయారు. ఈ ఘటన యాదగిరిగుట్ట కొండ ప్రాంతంలో భక్తులకు సేవలు అందిస్తూ రేకుల షెడ్లలో వ్యాపారాలు నిర్వహిస్తున్న చిరు వ్యాపారుల దయనీయ పరిస్థితిని మరోసారి వెలుగులోకి తీసుకువచ్చింది. ఈ సందర్భంగా స్థానికులు, ప్రజా సంఘాల ప్రతినిధులు స్పందిస్తూ రాష్ట్ర ప్రభుత్వం వడదెబ్బ మృతుల కుటుంబాలకు ప్రకటించిన రూ.4 లక్షల ఎక్స్‌గ్రేషియాను శ్రీనివాస్ కుటుంబానికి వెంటనే మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. అలాగే యాదగిరిగుట్టలో వ్యాపారం చేసుకునే చిరు వ్యాపారులకు రక్షిత షెడ్లు, తాగునీటి సౌకర్యాలు కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు.

03

జ్వాల
దశ
నిజం.. నిర్భయంగా..

ఖమ్మం-భద్రాద్రి కొత్తగూడెం జిల్లా

ఖమ్మం వైరా | సత్తుపల్లి | పాలేరు | మధిర
భద్రాద్రి కొత్తగూడెం కొత్తగూడెం | ఇల్లందు | పినపాక | భద్రాచలం | అశ్వరావుపేట

శనివారం
23-05-2026

WWW.DASHANEWS.COM



# కొత్త పెన్షన్ లు ఇవ్వాలని, పెంచిన ఆస్తి పన్నులు తగ్గించాలని 25న ధర్నా

❖ *మాజీ కార్పొరేటర్ల ఇండ్లలో పింఛను పరిశీలన ఆపాలి*

❖ *CPM పార్టీ ఖమ్మం డివిజన్ కార్యదర్శి వై విక్రమ్*



**దశ, ఖమ్మం:** రాష్ట్రప్రభుత్వం ఎన్నికల్లో హామీ ప్రకారం అర్హులైన వారికి వెంటనే నూతన పెన్షన్ లు ఇవ్వాలని, పెన్షన్ 2016 రూపాయలు నుంచి 4016 రూపాయలు పెంచి ఇవ్వాలని, ఖమ్మం నగరంలో పెంచిన ఆస్తి పన్నులు తగ్గించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 25 సోమవారం కార్పొరేషన్ కార్యాలయం వద్ద జరగబోయే ధర్నా జయప్రదం చేయాలని CPM పార్టీ ఖమ్మం డివిజన్ కార్యదర్శి వై విక్రమ్ కోరారు. శుక్రవారం సుందరయ్య భవనంలో జరిగిన పార్టీ టూ టౌన్ కమిటీ సమావేశంలో వై విక్రమ్ మాట్లాడారు. గతంలో brs ప్రభుత్వం వున్నప్పుడు కొత్త పెన్షన్ లు ఇవ్వలేదు అని, మేము అధికారంలోకి రాగానే కొత్త పెన్షన్ లు ఇస్తామని, ఇచ్చే పెన్షన్ పెంచి ఇస్తామని కాంగ్రెస్ ఎన్నికల ముందు హామీ ఇచ్చి అధికారంలో వచ్చి రెండున్నర సంవత్సరాల దాటిన కూడా నూతన పెన్షన్ లు ఇవ్వడం లేదు అని విమర్శించారు. 57 సంవత్సరాలు నిండిన వారికి పెన్షన్ లు ఇస్తామని హామీ కూడా అమలుచేయడం లేదు అని ఆరోపించారు. ఖమ్మం నియోజకవర్గం వేలాది మంది అర్హత వున్న వారు పెన్షన్ కోసం ఎదురు చూస్తున్నారు అని తెలిపారు. తాము అధికారంలోకి రాగానే పింఛను 2016 రూపాయలు నుంచి 4016 రూపాయలు పెంచుతాం అని రేవంత్ రెడ్డి ప్రభుత్వం హామీ వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఇప్పుడు అధికారులు వెరిఫికేషన్ పేరుతో అర్హత కల్గిన వారిని తీసివేస్తే సహించేది లేదని హెచ్చరించారు. పింఛను పరిశీలన కూడా మాజీ కార్పొరేటర్ల ఇండ్లలో కొద్దిమంది అధికారులు విచారణ చేస్తున్నారు అని ఆరోపించారు. ఈ ప్రజా సమస్యలపై సోమవారం కార్పొరేషన్ కార్యాలయం వద్ద జరగబోయే ధర్నా కు ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని వై విక్రమ్ కోరారు. ఈ సమయంలో పార్టీ టూ టౌన్ కార్యదర్శి బోడపట్ల సుదర్శన్, జె వెంకన్న బాబు, ch భద్రం, ఉపేంద్ర నాయక్, మచ్చా సూర్యం, రవీంద్ర, హుస్సేన్, షఫీ, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.



# పినపాకలో ఓటర్ మ్యాపింగ్ దాదాపు పూర్తి

❖ *తహసిల్దార్ జి.శ్రీనివాసరెడ్డి*

**దశ, పినపాక:** పినపాక మండలంలో ఓటర్ మ్యాపింగ్ ప్రక్రియ 78 శాతం పూర్తయిందని తహసిల్దార్ శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. శుక్రవారం పినపాక మండల కేంద్రంలోని తహసిల్దార్ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ, ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఓటర్ల వివరాల మ్యాపింగ్ కార్యక్రమాన్ని వేగవంతంగా నిర్వహిస్తున్నామని చెప్పారు. ఇప్పటివరకు 78 శాతం ప్రక్రియ పూర్తయ్యిందని, మిగిలిన పనులను కూడా త్వరితగతిన పూర్తి చేయడానికి అధికారులు, సిబ్బంది కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. ఓటర్లు తమ వివరాలను సరిచూసుకుని అవసరమైన మార్పులు ఉంటే సంబంధిత అధికారులకు తెలియజేయాలని ఆయన సూచించారు.

# సైనిక్ స్కూల్ ప్రవేశ పరీక్షలో ప్రతిభ కనబరిచిన విద్యార్థినిని సత్కరించిన ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు



**దశ, మణుగూరు :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరు మండలానికి చెందిన సక్సెస్ స్పార్క్ అకాడమీ విద్యార్థిని నాగుల జ్ఞానప్రసూనేశ్వరి (తండ్రి: శ్రీ శివప్రసాద్) ఆల్ ఇండియా సైనిక్ స్కూల్ ప్రవేశ పరీక్షలో విశేష ప్రతిభ కనబరిచి పినపాక నియోజకవర్గానికి గర్వకారణంగా నిలిచింది. దేశవ్యాప్తంగా సుమారు 2 లక్షల మంది విద్యార్థులు హాజరైన ఈ ప్రతిష్టాత్మక పరీక్షలో జ్ఞానప్రసూనేశ్వరి 9000వ ర్యాంక్ సాధించి అందరి ప్రశంసలు అందుకుంది. మొత్తం 300 మార్కులకు గాను 244 మార్కులు సాధించి తన ప్రతిభను చాటుకుంది. మొదటి రౌండ్ కౌన్సెలింగ్‌లోనే మహారాష్ట్ర మరియు కర్ణాటక రాష్ట్రాల్లోని సైనిక్ స్కూల్స్‌లో సీట్లు సాధించడం ద్వారా మరో ఘనతను సొంతం చేసుకుంది. ఈ సందర్భంగా పినపాక నియోజకవర్గ శాసనసభ్యులు పాయం వెంకటేశ్వర్లు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో విద్యార్థినిని శాలువాతో సత్కరించి అభినందనలు తెలిపారు. విద్యార్థిని కృషి, తల్లిదండ్రుల ప్రోత్సాహం, ఉపాధ్యాయుల మార్గదర్శకత్వం వల్లే ఈ విజయం సాధ్యమైందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. భవిష్యత్తులో మరింత ఉన్నత స్థాయికి చేరుకుని పినపాక నియోజకవర్గానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. విద్యార్థుల్లో లక్ష్యసాధనపై నిబద్ధత, క్రమశిక్షణ మరియు పట్టుదల ఉంటే ఎలాంటి ఉన్నత లక్ష్యాన్నైనా సాధించవచ్చని ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్ అన్నారు. ప్రభుత్వం విద్యార్థుల విద్యాభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. సక్సెస్ స్పార్క్ అకాడమీ విద్యార్థిని సాధించిన ఈ ఘనత పినపాక నియోజకవర్గానికి గర్వకారణమని స్థానికులు, విద్యార్థులు, ఉపాధ్యాయులు ఆనందం వ్యక్తం చేశారు.

# BJP ఎస్టీ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా కుంజా సంతోష్ నియామకం



**దశ, భద్రాచలం :** భారతీయ జనతా పార్టీ సంస్థాగత నిర్మాణ బలోపేతంలో భాగంగా, భద్రాచలం పట్టణానికి చెందిన బీజేపీ నాయకులు కుంజా సంతోష్‌ను BJP ఎస్టీ మోర్చా తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా నియమించారు. మాజీ ఎమ్మెల్యే కుంజా సత్యవతి కుమారుడైన కుంజా సంతోష్, గత తొమ్మిది సంవత్సరాలుగా బీజేపీలో చురుకుగా పనిచేస్తూ సామాజిక, రాజకీయ కార్యక్రమాల్లో విశేష పాత్ర పోషిస్తున్నారు. 2017లో బీజేపీలో ప్రారంభమైన ఆయన రాజకీయ ప్రస్థానంలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా యువ మోర్చా కార్యదర్శిగా, భద్రాచలం బీజేపీ మీడియా ఇంచార్జ్‌గా, అనంతరం ఎస్టీ మోర్చా రాష్ట్ర కార్యదర్శిగా వివిధ బాధ్యతలు నిర్వర్తించారు. ఈ సందర్భంగా కుంజా సంతోష్ మాట్లాడుతూ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా వచ్చిన బాధ్యతను కేవలం పార్టీ పదవిగా కాకుండా గిరిజన సమస్యలను రాష్ట్ర స్థాయిలో బలంగా వినిపించే అవకాశంగా తీసుకుంటానని తెలిపారు. కేంద్ర ప్రభుత్వ సహకారంతో రవాణా, పరిపాలనా సౌలభ్యాల దృష్ట్యా ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్‌లో ఉన్న ఐదు గ్రామ పంచాయతీలను తిరిగి భద్రాచలం నియోజకవర్గంలో విలీనం చేసే అంశంపై కృషి చేస్తానని పేర్కొన్నారు. అలాగే భద్రాచలం మారుమూల ప్రాంతాల్లో నివసిస్తున్న గుత్తికోయల అభివృద్ధి, సంక్షేమం కోసం తెలంగాణ రాష్ట్రంలో ఎస్టీ హోదా కల్పించే అంశాన్ని ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లేందుకు ప్రయత్నిస్తానని తెలిపారు. ఇప్పటి వరకు స్థానిక స్థాయిలో ప్రజా సమస్యలపై పోరాటం చేశామని, ఇకపై రాష్ట్ర స్థాయిలో భద్రాచలం మరియు గిరిజన ప్రాంతాల గొంతుకగా పనిచేస్తానని తెలిపారు.

# ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



❖ *99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక జిల్లా స్థాయి సమావేశంలో కలెక్టర్ అంకిత్*

**దశ, కొత్తగూడెం:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కేంద్రంలోని కొత్తగూడెం క్లబ్‌లో నిర్వహించిన 99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక జిల్లా స్థాయి సమావేశంలో జిల్లా కలెక్టర్ అంకిత్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రజల సంక్షేమం కోసం అమలు పరుస్తున్న పథకాల పురోగతి, గ్రామస్థాయిలో జరుగుతున్న అభివృద్ధి పనులు, ప్రజా సమస్యల పరిష్కారంపై విస్తృతంగా చర్చించారు. ముఖ్యంగా రైతులకు సాగునీటి సౌకర్యాలు, పేదలకు గృహ నిర్మాణ పథకాలు, మహిళా సంక్షేమ కార్యక్రమాలు, విద్యార్థులకు విద్యా ప్రోత్సాహక పథకాలు, వైద్య సేవల మెరుగుదల, రోడ్లు మరియు మౌలిక వసతుల అభివృద్ధి వంటి అంశాలపై సమీక్ష నిర్వహించారు. ప్రజా పాలనలో పారదర్శకత, వేగవంతమైన సేవలందింపు, ప్రతి అర్హులైన కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు చేరేలా అధికారులు కృషి చేయాలని కలెక్టర్ సూచించారు. గ్రామాలు, పట్టణాల్లో ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు గుర్తించి తక్షణ చర్యలు తీసుకోవాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. అలాగే ప్రభుత్వం ప్రవేశపెట్టిన అభివృద్ధి కార్యక్రమాలు ప్రజలకు నేరుగా ఉపయోగపడేలా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలని, ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టే విధంగా సేవలు అందించాలని జిల్లా కలెక్టర్ అంకిత్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కొత్తగూడెం, పినపాక, ఇల్లెందు ఎమ్మెల్యేలు కూనంనేని సాంబశివరావు, పాయం వెంకటేశ్వర్లు, కోరం కనకయ్య, కొత్తగూడెం కార్పోరేషన్ చైర్మన్ మూడ్ నగేష్, సబ్ కలెక్టర్ మృణాళ్ శ్రేష్ట, ఐటిడిఎ పీవో రాహుల్, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# జీలుగు విత్తనాలు పంపిణీ PACS చైర్మన్ కుర్రి నాగేశ్వరరావు



**దశ, మణుగూరు:** మణుగూరు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం కార్యాలయంలో జీలుగు విత్తనాలు రైతులకు చైర్మన్ కుర్రి నాగేశ్వరరావు శుక్రవారం పంపిణీ చేశారు. జిలుగు 30 కేజీల బస్తా 4905, సబ్సిడీ 50%, రైతులు 24 52 రూపాయలు ధరకు, పట్టా పాస్ బుక్ ఆధార్ కార్డు తీసుకొని విత్తనాలు పొందగలరని తెలిపారు. ఏడి ఏ తాతారావు ఏవో రావు రెడ్డి, ఏఈఓ లక్ష్మణరావు, సీఈఓ సునీల్, తెల్లం నరసింహారావు, పాల్గొన్నారు.

# మాజీ మంత్రి వెంకటరెడ్డి సేవలు మరువలేనివి

❖ *కాంగ్రెస్ నేత గుజ్జర్లపూడి రాంబాబు*



**దశ, కామేపల్లి:** చిరస్మరణీయుడు మాజీ మంత్రి, కీర్తిశేషులు రాంరెడ్డి వెంకటరెడ్డి ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కామేపల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గుజ్జర్లపూడి రాంబాబు అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు ఏపూరి మహేంద్ర కుమార్, మాజీ డీసీసీబీ డైరెక్టర్ మేకల మల్లిబాబు యాదవ్, ఓబీసీ జిల్లా అధ్యక్షులు పుచ్చకాయల వీరభద్రం యాదవ్, కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ ఫతే మహమ్మద్ పాల్గొన్నారు. శుక్రవారం కామేపల్లి మండలం కొత్త లింగాల క్రాస్ రోడ్ లో ఘనంగా నిర్వహించిన రాంరెడ్డి వెంకట రెడ్డి జయంతి వేడుకలలో వారు పాల్గొని వెంకటరెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించి ఆయన సేవలను కొనియాడారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..తెలుగు ప్రజల గుండెల్లో చెరుగని ముద్ర వెంకట రెడ్డి దని అన్నారు. ఈ కార్యక్రమంలో కామేపల్లి మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు,ప్రజా ప్రతినిధులు, రాంరెడ్డి అభిమానులు, సర్పంచులు, ఉప సర్పంచులు, మాజీ ఎంపీటీసీలు, మాజీ సొసైటీ డైరెక్టర్లు, పాలకవర్గ సభ్యులు, అనుబంధ సంఘాల నాయకులు, సానుభూతిపరులు, తదితరులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

# రైతులకు అన్యాయం జరగకుండా చూడాలి

❖ *డా.పొంగులేటి సుధాకర్ రెడ్డి*




**దశ, ఖమ్మం:** ఖమ్మం జిల్లా వేంసూర్ మండలం లచ్చన్నగూడెం PACS పరిధిలో మొక్కజొన్న, వరి ధాన్యం రైతులు కనీస మద్దతు ధర (MSP) అందక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న విషయాన్ని ఖమ్మం జిల్లా భారతీయ జనతా పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు భాస్కర్ని వీరంరాజు ద్వారా తెలుసుకున్న భాజపా జాతీయ నాయకులు డా. పొంగులేటి సుధాకర్ రెడ్డి తక్షణమే స్పందించారు. మొక్కజొన్న రైతులు క్వింటాలుకు రూ.400 నుంచి రూ.500 వరకు నష్టపోవాల్సి వస్తోందని, సొసైటీల స్పందన లేకపోవడంతో గత్యంతరం లేక రూ.1500 నుంచి రూ.1700 ధరకు దళారులకు అమ్ముకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందని రైతులు ఆవేదన వ్యక్తం చేసినట్లు తెలిపారు.

ఈ విషయంపై ఖమ్మం జిల్లా కలెక్టర్‌తో ఫోన్‌లో మాట్లాడిన డా.పొంగులేటి సుధాకర్ రెడ్డి, జిల్లా వ్యాప్తంగా ధాన్యం, మొక్కజొన్న రైతులను దళారులు, అధికారుల నిర్లక్ష్యం వల్ల నష్టపోకుండా చూడాలని, రైతులకు అన్యాయం జరగకుండా తక్షణ చర్యలు తీసుకోవాలని, బాధ్యులైన అధికారులపై చర్యలు తీసుకోవాలని కోరారు. దీనిపై సానుకూలంగా స్పందించిన కలెక్టర్, సంబంధిత అధికారులతో మాట్లాడి రైతులకు మేలు జరిగేలా, ఎలాంటి నష్టం జరగకుండా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు డా. పొంగులేటి సుధాకర్ రెడ్డి తెలిపారు. రైతులకు సక్రమంగా కనీస మద్దతు ధర అందేలా అధికారులు వెంటనే చర్యలు చేపట్టాలని ఆయన కోరారు.

# BRS పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జ్‌ల నియామకం

**దశ, ఖమ్మం:** బీఆర్ఎస్ పార్టీ సభ్యత్వ నమోదు కోసం రాష్ట్ర వ్యాప్తంగా 119 నియోజకవర్గలకు గాను పలువురు సీనియర్ నేతలను ఇన్‌ఛార్జ్‌లుగా బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ నియమించారు. BRS పార్టీ డిజిటల్ సభ్యత్వ నమోదు ఇంచార్జీలు ఉమ్మడి ఖమ్మం జిల్లా వారీగా ఇలా ఉన్నాయి. పినపాక (ఎస్టీ)కు దిండిగల రాజేందర్, ఇల్లందు (ఎస్టీ)కు చాడ కిషన్ రెడ్డి, ఖమ్మంకు అనుగుల రాకేష్ రెడ్డి, పాలేరుకు ఎమ్మెల్సీ తాతా మధు, మధిర (ఎస్సీ)కు మాజీ ఎంపీ నామా నాగేశ్వరరావు, వైరా (ఎస్టీ)కు ఆర్‌జేసీ కృష్ణ, సత్తుపల్లి (ఎస్సీ) కు కురాకుల నాగభూషణం, కొత్తగూడెంకు ఎంపీ వద్దిరాజు రవిచంద్ర, అశ్వారావుపేట (ఎస్టీ)కు ఉప్పల వెంకటరమణ, భద్రాచలం (ఎస్టీ)కు రావులపల్లి రామ్ ప్రసాద్‌ను సభ్యత్వ నమోదు ఇన్‌చార్జిలుగా కేసీఆర్ నియమించారు. ముందుగా నియోజకవర్గ ఇన్‌ఛార్జ్‌లకు హైదరాబాద్‌లో తెలంగాణ భవన్‌లో శిక్షణ ఇవ్వనున్నారు. అనంతరం నియోజకవర్గ వ్యాప్తంగా ఎంపిక చేసిన ముఖ్యమైన కార్యకర్తలకు సభ్యత్వ నమోదుపై శిక్షణ ఇస్తారు.